మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక
కావలెను
'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.
కావలసిన ప్రాంతాలు :
కరీంనగర్ జిల్లా : సైదాపూర్, గంగాధర, గన్నేరువరం, హుజురాబాద్ ఆర్.సి. రామడుగు
జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలలో స్టాఫ్ రిపోర్టర్లు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక
ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాలయం
సాయికృష్ణ థియేటర్ ఎదురుగా
భగత్‌నగర్, కరీంనగర్.
పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
సెల్ : 83339 98076




# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

సోమవారం | 4 | సెప్టెంబర్ | 2023 | పేజీలు : 8




# వామపక్షాల పూర్వ వైభవ 'కల' నెరవేరనా..?

మంచిర్యాల, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): సమరశీల పోరాటాలకు ఆలవాలంగా ఉన్న వామపక్షాలు ప్రస్తుతం తమ పూర్వ వైభవాన్ని సంతరించుకునేందుకు యత్నాలు సాగిస్తున్నాయి. గతంలో తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి ఒంటరిగా బరిలో నిలిచి తమ సత్తా చాటిన సిపిఐ, సిపిఎంలు ఎన్టీఆర్ హయాంలో నుంచి ఇతర పార్టీలతో కలిసి ఎన్నికల బరిలో నిలిచాయి. ఆయా సందర్భాల్లో ప్రభావం చూపించినప్పటికీ, ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు వేరుగా కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు టిడిపి, కాంగ్రెస్, టీఆర్ఎస్‌లతో అంటకాగిన వామపక్షాలు ఆ కలయికల వల్లనే ప్రాభవం కోల్పోయాయన్న అపప్రదను ఎదుర్కొంటున్నాయి. ఇటీవల జరిగిన మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా సిపిఐ, సిపిఎంలను అక్కున చేర్చుకుని విజయం సాధించిన బిఆర్ఎస్ అధిష్టానం, రాబోయే ఎన్నికల్లో మాత్రం ఆ రెండు పార్టీలను దూరం పెట్టింది. ఇప్పటి వరకు బిఆర్ఎస్‌తోనే తిరిగి ఎన్నికల బరిలో నిలుస్తామని భావించిన వామపక్షాల నాయకులకు ఇది మింగుడు పడని విషయమే అయినా, తాము మతతత్వ బిజెపిని ఓడించేందుకు మాత్రమే బిఆర్ఎస్‌తో కలిసి పనిచేశామని సర్ది చెప్పుకుంటున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్‌తో పొత్తు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు.ఇప్పటి కే అధికారంలో ఉన్న బిఆర్ఎస్ 115 నియోజకవర్గాల్లో పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్య మంత్రి కె.చంద్రశేఖర్‌రావు అభ్యర్థులను ప్రకటించి ప్రతి పక్షాలకు ఒకరకంగా సవాల్ విసిరారు. మిగిలిన కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ, బిఎస్‌పిలతో పాటు ఉభయ కమ్యూనిస్ట్ పార్టీ లైన సిపిఐ, సిపిఎంలు కూడా ఎన్నికల రణరంగానికి సిద్ధం అవుతున్నాయి. తమ పార్టీల భవిష్యత్ కార్యాచరణ కోసం రాష్ట్ర కమిటీ లు బేటీ అవుతూ ఎక్కడ ఎక్కడ పోటీ చేయాలి, ఏ స్థానం లో ఏ పార్టీ పోటీ చేయాలన్న విషయంపై మల్ల గుల్లాలు పడుతున్నాయి. మునుగోడు ఉప ఎన్నికలో తమను బిఆర్ఎస్ పార్టీ వాడుకుని గెలిచి ఇపుడు వదిలి వేసిన తీరును జీర్ణించుకోలేక పోతున్నాయనే విషయం నూటికి నూరు పాళ్ళు నిజం. పైకి గాంభీర్యంగా కనపడుతున్న కమ్యూనిస్టులు తమకు జరిగిన పొత్తుల అవమానం ను తట్టుకోలేక పోతున్నారు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండనే ఉంటారు. ఇపుడు కమ్యూనిస్టల పట్ల నిజమైందని విశ్లేషకుల భావన కూడ. బిజెపి ప్రమాదకారి అని అందుకే మునుగోడు లో బిఆర్ఎస్‌కు మద్దత్తు ఇచ్చామని, తమ ఓట్లు కూడా కలసి అక్కడ గెలుపు సాధ్యమైందని ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల నాయకులు చెబుతూనే రాజకీయాల్లో మోసం చేసే వాళ్ళు.. మోసపోయే వాళ్ళు ఉండరని పలుకులు పలికారు. తమను సంప్రదించకుండా, సమాచారం కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా అభ్యర్థులను కెసిఆర్ ప్రకటించడం పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎర్ర రంగు కొంచం రంగు మారినా తమకు ప్రజల్లో ఆదరణ తగ్గలేదన్న ధీమాతో కమ్యూనిస్టులున్నారు. నిరంతరం ప్రజల్లో ఉండేది ఎర్ర జండానే నమ్ముతూ గత పూర్వ వైభవాన్ని తిరిగి పొందడానికి కలలు కంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో కమ్యూనిస్టుల హవా ఉండేది. అంతే కాదు ఎమ్మెల్యేలుగా కూడ గెలిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రజల సమస్యలు వినిపించారు. ఉమ్మడి జిల్లాలైన ఆదిలాబాద్‌లో బెల్లంపల్లి, మంచిర్యాల తాండూర్ లు కరీంనగర్ జిల్లాలో రామగుండం, పెద్దపల్లి వరంగల్ జిల్లాలో భూపాలపల్లి ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం, ఖమ్మం, పాలేరు, నల్గొండ జిల్లాలో దేవరకొండ, నల్గొండ, మునుగోడు ముఖ్యమైనవి.

### ఉమ్మడి ఆదిలాబాద్ లో...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లో వివిధ ప్రాంతాల్లో పార్టీ ఉన్నప్పటికీ సిపిఐ ఎక్కువగా సింగరేణి కార్మికులు ఉన్న మిగతా 2లో..

## ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్ రాజ్



2 లో

## రాబోయే ఎన్నికలలో ఓటరు జాబితా పకడ్బందీగా ఉండేలా చూడాలి

- 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు
- సెప్టెంబర్ 19 నాటికి ఓటరు జాబితాలో అభ్యంతరాల స్వీకరణ
- పెద్దపల్లి జిల్లా ,జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- చిన్న కల్వాల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

2 లో



# ప్రాణాలకు తెగించి..

## చెరువు మధ్యలో స్తంభంపై విద్యుత్‌ను పునరుద్ధరించిన జూనియర్ లైన్‌మెన్‌లు



హుజురాబాద్ రూరల్, సెప్టెంబర్ 3 (మనం న్యూస్)ః గ్రామానికి నిలిచిపోయిన విద్యుత్‌ను అందించేందుకు జూనియర్ లైన్‌మెన్‌లు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారు. చెరువు మధ్యలో ఉన్న ఫీడర్ లైన్ వద్దకు నీటిలో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించారు. హుజూరాబాద్ డివిజన్‌లోని రాజపల్లి 33/11కెవి సబ్ స్టేషన్ నుంచి చిలుకూరుకు 11 కెవి ఎక్స్‌ప్రెస్ ఫీడర్ లైన్ స్థానికంగా ఉన్న చెరువులో నుంచి వెళ్తుంది. ఆదివారం ఉదయం చెరువులో ఉన్న ఒక స్తంభంపై 11 కెవి లైన్ బ్రేక్‌డౌన్ అయ్యి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో చెల్పూర్ జేఎల్‌ఎం వెంకటేశ్వర్లు, ఎఎల్‌ఎం పరశురాం చెరువులోకి ఈదుకుంటూ వెళ్లి లైన్‌కు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. చెరువులో ఉన్న విద్యుత్ స్తంభం వద్దకు ఈత కొడుతూ వెళ్లి సరఫరాను పునరుద్ధరించిన సిబ్బందిని ఎస్సై గంగాధర్, గ్రామ ప్రజలు అభినందించారు.

# రాబోయే ఎన్నికలో ఓటరు జాబితా పకడ్బందీగా ఉండేలా చూడాలి



సుల్తానాబాద్,సెప్టెంబర్ 03 మనం న్యూస్ ః 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని జిల్లా కల్టెకర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని చిన్న కల్వల గ్రామంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 194,195 లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ నమోదు సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారందరూ,అక్టోబర్ 1.2023 నాటికి 18 సంవత్సరాలు నిండ బోయే పౌరులకు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే విధంగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. రాబోయే ఎన్నికలో ఓటరు జాబితా పకడ్బందీగా ఉండేలా చూడాలని,ఓటరు జాబితాలో మరణించిన వ్యక్తుల వివరాలు,గ్రామం వదిలి ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి పేరు తొలగించే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 19 లోపు తెలియజేయాలని,అక్టోబర్ 1.2023 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ఇంటింటికి తిరిగి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అంతకుముందు స్వీప్ ఆక్టివిటీష్‌లో భాగంగా హక్కుపై అవగాహణ కల్పిస్తూ చిన్నకల్వలలో నిర్వహించిన ముగ్గుల పోటీలను పెద్దపల్లి ఆర్డీవో మధుమోహన్ పరిశీలించగా,వారి వెంట సుల్తానాబాద్ తహసీల్దార్ మధుసూధన్‌రెడ్డి ఉన్నారు. ప్రత్యేక ఓటర్ నమోదు సెంటర్ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట సర్పంచ్ రమేష్,బూత్ స్థాయి అధికారులు గడ్డం లక్ష్మణ్, శోభ,పంచాయతీ కార్యదర్శి సతీష్,తదితరులు పాల్గొన్నారు.

# వామపక్షాల పూర్వ వైభవ 'కల' నెరవేరనా..?

మొదటి పేజీ తరువాయి..

ఆసిఫాబాద్ నియోజకవర్గాన్ని ఎంచుకుంది. ఈ నియోజకవర్గంలోని బెల్లంపల్లి, తాండూర్‌తో పాటు చుట్టుపక్కల పల్లెలు, సింగరేణి కార్మికుల వారి కుటుంబ సభ్యుల ఓట్లు ఇక్కడ కీలకం. 1978 ఎన్నికల్లో (ఎస్సీ) కాంగ్రెస్ అభ్యర్థి దాసరి నర్సయ్య 1983 ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థి గుండా మల్లేష్ ఎమ్మెల్యే గా గెలిచారు. 1989 లో కాంగ్రెస్ అభ్యర్థి దాసరి నర్సయ్య,1994 లో తిరిగి సిపిఐ అభ్యర్థి గుండా మల్లేష్, 1999లో టిడిపి అభ్యర్థి డాక్టర్ పాటి సుభద్ర, 2004లో టిడిపి అభ్యర్థి ఏ.శ్రీదేవి, 2009లో సిపిఐ అభ్యర్థి గుండా మల్లేష్ గెలిచారు. ఆయనకు 41వేల957 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి చిలుముల శంకర్ కు 33065, ప్రజా రాజ్యం పార్టీ అభ్యర్థి ఏ. శ్రీదేవి కి 19వేల40 ఓట్లు వచ్చాయి. ఇక 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయినా తరువాత జరిగిన ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గం వేరు పడి అదులోని బెల్లంపల్లి నియోజకవర్గం ఎన్నికల్లో అప్పటి బిఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య 73వేల779 ఓట్ల తో ఎమ్మెల్యే గా విజయం సాధించారు. సిపిఐ అభ్యర్థి గుండా మల్లేష్ కు21251, టిడిపి అభ్యర్థి డాక్టర్ పాటి సుభద్ర కు 9వేల167 ఓట్లు వచ్చాయి. ఇక 2018 ఎన్నికల్లో కూడా బిఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య 50వేల26 ఓట్లతో గెలుపును స్వంతం చేసుకోగా, మొదటిసారి పోటీ చేసిన బిఎస్పీ అభ్యర్థి (కాంగ్రెస్ లో మాజీ మంత్రి ) గడ్డం వినోద్ కు 43వేల750 ఓట్లు, సిపిఐ అభ్యర్థి గుండా మల్లేష్ కు 3,905, బిజెపి అభ్యర్థి కొయ్యల ఏమాజీకి 3,031 ఓట్లు వచ్చాయి.

### ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో...

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రామగుండం నియోజకవర్గం లో 2009 లో ఇండిపెండెంట్ గా పోటీ చేసిన సోమారపు సత్యనారాయణ 32,479 ఓట్లు సాధించి గెలిచారు. పిఆర్‌పి అభ్యర్థి కే. హరినాథ్ కు 30,259, కాంగ్రెస్‌అభ్యర్థి బాబార్ సలీం పాషాకు 23,283, బిఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్ కు కేవలం 15,984 ఓట్లు వచ్చాయి. 2014 లో సోమారపు సత్యనారాయణ బిఆర్ఎస్ తరపున 35,789 ఓట్లతో గెలిచారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి కోరుకంటి చందర్ కు 33,494, కాంగ్రెస్ అభ్యర్థి బాబర్ సలీం పాషా కు 16900 ఓట్లు, బీజేపీ అభ్యర్థి గుజ్జుల రామకృష్ణ రెడ్డి కి 7894 ఓట్లు వచ్చాయి. 2018 లో తిరిగి కోరుకంటి చందర్ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి గా పోటీచేసి 61వేల400 ఓట్లతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి సోమారపు సత్యనారాయణ కు 34వేల981, కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ కు 27వేల181, బిఎస్‌పి అభ్యర్థి మెరుగు శోభ కు 1,797, బీజేపీఅభ్యర్థి వనిత బలుమూరికి కేవలం 1,553 ఓట్లు మాత్రమే లభించాయి.

### ఉమ్మడి వరంగల్ జిల్లాలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి నియోజకవర్గం లో సింగరేణి కార్మికుల ఓట్లు ఉన్న సిపిఐ ఇంత వరకు పోటీ చెయ్యలేదు. కానీ సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో పార్టీ అనుబంధ కార్మిక యూనియన్ సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఎఐటియుసి), 2004 లో గెలిచి సత్తా చాటగా టిఆర్ఎస్ అనుబంధ సంఘం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఓడిపోయింది..2010 ఎన్నికల్లో కూడా గెలిచింది. ఈ నియోజకవర్గంలో కూడా సింగరేణి కార్మికుల ఓట్లే కీలకం. అయినా కమ్యూనిస్ట్ లు నియోజకవర్గంలో పోటీ చేయలేదు. కేవలం కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులు మాత్రమే పోటీలో ఉండటం గమనార్హం. ప్రసుతం 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గా గెలిచి బిఆర్ఎస్‌లో చేరిన గండ్ర వెంకట రమణారెడ్డిఎమ్మెల్యే గా ఉన్నారు. ఇప్పుడు బిఆర్ఎస్‌తో పొత్తు లేకపోవడంతో మరి కమ్యూనిస్ట్‌లు ఈ నియోజకవర్గంలో పోటీ చేస్తారా..? కాంగ్రెస్ అభ్యర్థి కి మద్దతిస్తారా.. వేచి చూడాలి..

### ఉమ్మడి ఖమ్మం విషయం లో...

ఉమ్మడి ఖమ్మం లో కమ్యూనిస్ట్ లకు చాలా ఓటు బ్యాంకు ఉంది. ఖమ్మం, కొత్త గూడెం, పాలేరు ప్రాంతాల్లో ఉభయ కమ్యూనిస్ట్ పార్టీలకు ఘన చరిత్ర ఉంది. ఖమ్మం లో 1962 లో సిపిఐ నుంచి నల్లమల గిరిప్రసాద్, 1989, 1994 లో పువ్వాడ నాగేశ్వర్ రావు 2004 లో ఎమ్మెల్యే లుగా గెలిచారు. ఇక సిపిఎం అభ్యర్థిగా 1967, 1972 లో ఎండి. రాజబ్ అలీగెలువగా, 1983,1985 లో మంచికంటి రామకృష్ణ విజయం సాధించారు. 2009, 2014, 2018లో వీరి ప్రాతినిధ్యం అసెంబ్లీ లో లేదు.

### కొత్తగూడెం అసెంబ్లీలో...

2009 లో సిపిఐ అభ్యర్థి కూనం నేని సాంబశివరావు 47028 ఓట్లతో ఎమ్మెల్యే గా గెలిచారు. సమీప కాంగ్రెస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వర్ రావుకు 45024, ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి ఎ. కృష్ణ కు 38,876 ఓట్లు వచ్చాయి. ఇక 2014,2018 లో ఇక్కడ కూడా కమ్యూనిస్ట్ ల జండాను ఎగురవెయ్యలేదు.పాలేరు అసెంబ్లీ లో..1983 లో సిపిఐ అభ్యర్థి బీరుపాక భూమన్న 35915 ఓట్లతో గెలుపొందగా కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ కు 27626 ఓట్ల తో ఓడిపోయారు. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎస్. చంద్రశేఖర్ కు 55835 ఓట్లు రాగా, సిపిఎం అభ్యర్థి హన్మంత్ రాజ్ 51530 తెచ్చుకుని ఓడిపోయారు. 1994 లో సిపిఎం అభ్యర్థి గా సండ్ర వీరయ్య పోటీ చేసి 63328 ఓట్లు సాధించిఎమ్మెల్యే గా గెలువ గా, కాంగ్రెస్ అభ్యర్థి ఎస్. చంద్రశేఖర్ 53172 ఓట్లు సాధించి ఓడిపోయారు. 1999 లో కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ 51638 గెలువగా, సిపిఎం అభ్యర్థి సండ్ర వీరయ్య ఓడిపోయారు. ఈయనకు 40380 ఓట్లువచ్చాయి.2004 లో పోటీ చెయ్యలేదు. 2009 లో సిపిఎం అభ్యర్థి తమ్మినేని వీరభద్రం కు 58889 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి ఆర్. వెంకట్ రామిరెడ్డి కి 64555 ఓట్లు రావడం తో తమ్మినేని వీరభద్రం ఓటమి పాలయ్యారు. అలాగే 2014 లో సిపిఎం అభ్యర్థి గా పాతీనేని సుదర్శన్ రెడ్డి 44245 ఓట్లు సాధించి మూడవ స్థానం లో నిలిచారు. మరోసారి కాంగ్రెస్ అభ్యర్థి ఆర్. వెంకట్ రామిరెడ్డి 69707 ఓట్లు సాధించి గెలిచారు.. రెండవ స్థానం లో టీడీపీ మేచినేని బేబీ స్వర్ణ కుమారి47844 ఓట్లతో ఉన్నారు. ఇక 2016 లో జరిగిన ఉప ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థి పోతినేని సుదర్శన్ రెడ్డి కి 15538 ఓట్లు వచ్చాయి. ఈయన 4 వ స్థానం లో నిలిచారు. తెరాస నుంచి పోటీ చేసిన తుమ్మల నాగేశ్వర్ రావ్ కు 94940 ఓట్లతో విజయం అందుకోగా, 49258 ఓట్లు సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి ఆర్.సుచిత్రా రెడ్డి రెండవ స్థానం లో నిలిచారు. ఇక 2018 ఎన్నికల్లో కందుల ఉపేందర్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి గా పోటీ చేసి 89047 ఓట్ల తో గెలిచారు. ఆ తర్వాత బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

బిఆర్ఎస్ నుంచి పోటీ చేసిన తుమ్మల నాగేశ్వర్ రావ్ కు 81,738 ఓట్ల తో ద్వితీయ స్థానం, సిపిఎం అభ్యర్థి బత్తుల హైమవతి కేవలం 6769 ఓట్ల తో సరిపెట్టుకుని మూడవ స్థానంలో నిలిచారు. ప్రస్తుత మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి,కరీంనగర్ జిల్లా లోని రామగుండం, ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, ఖమ్మం, పాలేరు, నల్గొండ జిల్లా లోని మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో పోటీకి కమ్యూనిస్ట్ ల దృష్టిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ కాంగ్రెస్ తో పొత్తు పొడిస్తే ఆ పార్టీ ఎన్ని సీట్లు ఇస్తుందో, ఒకవేళ ఏ పార్టీ తో పొత్తు కుదరక పోతే ఉభయ కమ్యూనిస్ట్ పార్టీలు ఎన్ని సీట్లకు కలసి పోటీ చేసి గెలుపులను స్వంతం చేసుకుని గత పూర్వ వైభవ ' కల' నిజం అవుతుందో లేదో వేచి చూడాల్సిందే..

# ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలి

కొమురంభీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 3 (మనం న్యూస్)ః రాష్ట్రంలో 18 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉండే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీవోలు సురేష్, రాజేశ్వర్ లతో కలిసి సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2వ ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా గత నెల 21 నుండి ఈ నెల 19 వరకు నిర్వహిస్తున్న నూతన ఓటరు నమోదు, ఓటర్ జాబితా మార్పులు, సవరణలు, తొలగింపుల కొరకు ఫారం 6, 7 ,8 ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా సరిహద్దులలో చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాలను పర్యవేక్షించడం జరుగుతుందని, పి వి టి జి లు, ట్రాన్స్ జెండర్లు, దివ్యాంగులు, ఆదివాసిలు తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లు ఇంటింటికి తిరుగుతూ ఓటరు



నమోదుపై అవగాహన కల్పించడం జరుగుతుందని, వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కళాశాలలను వయసు అర్హత గల వారిని గుర్తించి వివరాలు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జనాభా నిష్పత్తి, లింగ నిష్పత్తి ప్రకారంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేక మార్కింగ్ చేయడం జరుగుతుందని, తప్పులు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మత్స్య కార్మికుల సంక్షేమ సంఘాలకు కృషి చేస్తా

## రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రవీందర్

శంకరపట్నం ,సెప్టెంబర్ 3 (మనం న్యూస్): శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో సీనియర్ జర్నలిస్ట్ కొరిమి వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా ఆదివారం తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘం చైర్మన్ పుట్టిన రవీందర్ కలిసి ఆయనను శాలువా కప్పి సన్మానించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పిట్టల రవీందర్ మాట్లాడుతూ వెంకటస్వామి జిల్లావ్యాప్తంగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో మత్స్య కార్మిక సంఘాల సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. రాష్ట్రంలో ఒరిస్సా రాష్ట్రం మాదిరిగా ఎల్ఎండి నుండి హుజురాబాద్ వరకు గల కాకతీయ కాలువలలో పైలట్ ప్రాజెక్టుగా చేపల పెంపకాల చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.కిలోమీటర్ నుండి రెండు కిలోమీటర్ల మధ్యలో స్టాపర్లను నిర్మిస్తామని ఆయన అన్నారు .రాష్ట్ర ప్రభుత్వం నుండి చేపలను అందించే బాధ్యత తనదని చెప్పారు వాటిని పెంచి ఆర్థిక లాభాలు పొందే బాధ్యత మత్స్యకారులదని ఆయన అన్నారు.గత ప్రభుత్వాలు మత్స్యకారులకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ,కానీ కెసిఆర్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి మత్స్యకార్లకు పూర్తి అండగా ఉంటుందని ఆయన తెలిపారు.చెరువులు కుంటలు కబ్జా కు గురి కాకుండా హద్దులు నిర్మిస్తామని సంఘ నాయకులకు హామీ ఇచ్చారు.కేసీఆర్ ప్రభుత్వం హయాంలో తనకు



మత్స్య సహకార సంఘాల సమైక్య చైర్మన్ పదవి కట్టబెట్టడం ఇందుకు నిదర్శనమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండల మత్స్యకార సంఘం నాయకులు కీసర సంపత్, అరిగే ప్రభాకర్, దాట్ల తిరుపతి, తాళ్ల సమ్మయ్య, మాజీ ఎంపిటిసి దొంగల రాములు, తదితరులు పాల్గొన్నారు.



### బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పై

# నిషేదాజ్ఞలు కొనసాగింపు

## పోలీస్ కమీషనర్ ఎల్ సుబ్బరాయుడు

కరీంనగర్ క్రైం,సెప్టెంబర్ 03( మనం న్యూస్): సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈ నెల 30 వరకు పొడిగించడం జరిగిందని పోలీస్ కమీషనర్ ఎల్ సుబ్బరాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాధులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. మద్యం సేవించి మద్యం ప్రియులు వీధుల్లో, రోడ్లపై అసభ్యపద జాలంతో మాట్లాడుతుడటం, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణ మించిందన్నారు. మద్యంప్రియుల ఆగడాలకు కళ్ళెం వేయడంతోపాటు ప్రజల భద్రత, రక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. నిషేదాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని కోల్ ఇండియా చైర్మన్‌కు వినతి



మంచిర్యాల,03,సెప్టెంబర్ (మనం న్యూస్ ): కోల్ ఇండియా పరిధిలోని బొగ్గు గనుల్లో పనిచేసి పదవి విరమణ పొందినరిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ సి. ఎం. పి. ఎస్ -1998 సమస్యలను పరిష్కరించాలని ఫెడరేషన్ ఆఫ్ కోల్ ఇండస్ట్రీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఫ్. సి.ఐ. ఆర్. ఇ. ఏ ) నాయకుల బృందం కోల్ ఇండియా చైర్మన్ పి. ఎం. ప్రసాద్ ను కోల్ కతా లో కలసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ బృందం లో సి. ఐ. ఎల్. మాజీ చైర్మన్ ఎన్. సి. ఝా ఎఫ్. సీ. ఐ. ఆర్. ఈ. ఏ.అధ్యక్షులు ఆర్. బి. ఉపధ్యాయ స్థానిక ప్రతినిధి భీమన్ మిత్రా, ఎస్. సి.సి. ఎల్. జనరల్ సెక్రటరీ జ. వి. దత్తాత్రేయలు ఉన్నారు. సి. ఎం. పి. ఎస్.పెన్షన్ సమస్య ను కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి దృష్టిలో పెట్టాలని,పెన్షన్ స్కీం ప్రకారం దాంట్లో ఉన్న పెన్షన్ ఫండ్ వివరాలు సమీక్షించాలనికోరారు. పెన్షన్ ఫండ్ కు ప్రతి తన్ను బొగ్గు కు విరాళాలాన్ని సముచితంగాపెంచడానికి లేదా జూన్,2018 లో జరిగిన సి. ఎం. పి. ఎఫ్. ఓ. బోర్డు ఆఫ్ట్రస్టీ లో సబ్ కమిటీ సిఫార్స్ చేసిన వాటిని అమలు పరిస్తే గ్రేడ్ లేదాపోస్ట్ లో ఉంది రిటైర్డ్ అయిన పాత పెన్షన్ పొందున్నవారు కొత్త పెన్షన్ లో50 శాతం కంటే తక్కువ కాకుండా పెన్షన్ పొందవచ్చని అన్నారు. వితంతు పెన్షన్‌లో ఇలాంటి అవాంతరాలు రాకుండ మంజూరు అయ్యేలా పెన్షన్ స్కీం -1998 ను సవరించి పెన్షన్ పేమెంట్ ఆర్డర్స్ ను ఇవ్వడానికి అవసరమైన చర్యలుతీసుకోవాలని కోరారు. బొగ్గు పెన్షనర్స్ ప్రయోజనాలను సూచించడానికి సీ. ఎం.పి ఎఫ్ యొక్క బి. ఓ. ట్రస్ట్ లో మా అసోసియేషన్ నుంచి ఒకరిని నామినెట్‌చేయడానికి బొగ్గు మంత్రిత్వ శాఖకు సిపార్స్ చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.పదవి విరమణ పొంది 70 లేదా 75 ఏళ్ళు నిండిన వారికి ఓ ఎన్ జి సీ, ఇతర ప్రభుత్వ రంగ చమురు కంపెనీ ల్లో అమలు చేస్తున్న ఫెలిసిటేషన్ పథకాన్నితమకు కూడా అమలు చేయాలని కోరారు. కోల్ ఇండియా చైర్మన్ తమ సమస్య లపై శానుకూలంగా స్పందించారని, సమస్య లను కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు సిపార్స్ చేయడానికి హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

## ముదిరాజ్ కులస్తుల మహాధర్నా

సిరిసిల్ల అర్బన్,సెప్టెంబర్03 (మనంన్యూస్): ముదిరాజులకు టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్స్ ఇవ్వాలని కోరుతూ పట్టణంలోఆదివారం మహాదర్నా న్విహించారు. అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్ కులస్తుల కు జనాభా తమాషా ప్రకారం ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.అంతేకాకుండా సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే ,తెలంగాణ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీని ఓడిస్తామని తెలిపారు.సిరిసిల్లలో కెటిఆర్ ను ఓడించి తీరుతామని డిమాండ్ చేశారు.తమ హక్కుల (డిమాండ్) ల సాధన కై భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ముదిరాజ్ కులస్తులు తరలివచ్చారు.

# ప్రజలు ఆలోచించి ఓటేయాలి

## ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జోజిరెడ్డి

కరీంనగర్, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటేయాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి జోజిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పరిస్థితి పూర్తి అస్తవ్యస్తంగా ఉన్నా, స్థానికంగా ప్రాతినిధ్యం వహిస్తోన్న మంత్రి గంగుల కమలాకర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్మార్ట్ సిటీగా ప్రకటనిస్తోన్న కరీంనగర్‌లో ప్రధాన రోడ్లతో సహా అన్ని ప్రాంతాల పరిస్థితి అధ్వా న్నంగా ఉన్నా, అద్దంలా ఉందని పేర్కొంటూ చేతులు దులుపుకుం టున్నారని విమర్శించారు. నగరంలోని శ్రీపురం కాలనీ, రజ్వీ చమాన్, 23, 44వ డివిజన్లు, కలెక్టరేట్, జగిత్యాల మెయిన్ రోడ్డుతో పాటు పలు ప్రాంతాలు చిరుజల్లులకే జలమయమై మోకాళ్ల లోతు నీరు నిలిచిపోతుందన్నారు. జనావాస ప్రాంతాల్లో నీరు నిలిచి దోమలు, పందులు, క్రిమికీటకాలకు ఆవాసంగా మారి వందలాది మంది అంటువ్యాధులు బారిన పడుతున్నా మంత్రి పట్టించుకోకుం డా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ ప్రజలు ఆలోచించాలని, ప్రజల సమస్యలు పట్టించుకోని బిఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని, ప్రజా హితమే ధ్యేయంగా, సుభాష్ చంద్రబోస్ ఆశయాలతో ముందుకు సాగుతోన్న ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్‌కు మద్ధతు తెలపాలని జోజిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఫార్వర్డ్ బ్లాక్ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల విజయ్ కుమార్, వి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




# పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

## డిపివో వీర బుచ్చయ్య




కరీంనగర్,సెప్టెంబర్ 3 (మనం న్యూస్): హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'మన గణపతి మట్టి గణపతి 'అనే నినాదంతో ముద్రించిన వాల్ పోస్టర్ ను కరీంనగర్ డిస్ట్రిక్ట్ పంచాయతీ ఆఫీసర్ వీర బుచ్చయ్య పటేల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిపిఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని ప్రతి ఒక్కరు గ్రహించాలని అని తెలిపారు.గత తొమ్మిది సంవత్సరాల నుండి హమ్ స్వచ్ఛంద సంస్థ ప్రతి ఏటా వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలలో పిఓపితో తయారుచేసిన గణేశులు వద్దు మట్టి గణపతి ముద్దు అనే నినాదంతో ప్రచారం నిర్వహిస్తూ వారిలో చైతన్యాన్ని కలుగజేస్తున్నారని తెలిపారు. వారికి మా అభినందనలు అని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు ధనపురి సాగర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను కాకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలను మాత్రమే పెద్ద పెద్ద మండపాల్లో ప్రతిష్టించాలని తద్వారా అందరం పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించిన వాళ్ళం అవుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిపిఓ వీర బుచ్చయ్య పటేల్ , సంస్థ అధ్యక్షులు ధనపురి సాగర్, నక్క రాఘవేందర్, తోట అనిల్, తొడ్పునూరి తిరుపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన యువకులు



మంచిర్యాల,సెప్టెంబర్ 3 ( మనం న్యూస్ ) : గూడెం గ్రామానికి చెందిన యువ నాయకులు గోవర్ధన సాయితేజ ఆధ్వర్యంలో దండేపల్లి మండలం గూడెం, కన్నపెల్లి గ్రామాలకు చెందిన వంద మంది యువకులు ఆదివారం బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ వారికి గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

## దళిత యువకులను చిత్రహింసలు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలి

### అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు జలపతి



తిమ్మాపూర్, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని దళిత యువకులు దొంగతనం చేశారనే నెపంతో చిత్రహింసలకు గురిచేసిన వారిపైఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు పారునంది జలపతి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మీడియా సమావేశంలో ఆయన మా ట్లాడుతూ మేకను దొంగలించరని అనే నెపంతో దళిత యువకులైన తేజ, కిరణ్ లను బంధించి కాళ్లు, చేతులు కట్టేసి, తలకిందులుగా వేలాడదీసి, చిత్రహింసలకు గురి చేసిన రాములు, అతని కుటుంబ సభ్యులపై చట్ట పరంగా కేసు నమో దు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే బాధిత కుటుంబానికి ప్రభు త్వం న్యాయం చేయాలని, రానున్న రోజుల్లో దళితులపై ఇలాంటి దాడులు పునరావృతమైతే ఉపేక్షించేది లేదని, అవసరమైతే దళితుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

### వినోద్‌కుమార్‌కు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వినతి



కరీంనగర్, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న జౌట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ జిల్లా జౌట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జాయింట్ ఆక్షన్ కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినిపల్లి వినోద్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో కలిసిన కమిటీ సభ్యులు మూడు సంవత్సరాల కాలపరిమితి పైబడిన వారందరిని ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించేలా కృషి చేయాలని వినోద్ కుమార్ ను కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జువ్వాడి సంధ్య, సమంత, కమల్, రవీంధర్ గౌడ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# సాలు సారూ.. మీ పాలన..

### - బాల్క సుమన్ తీరుకు నిరసనగా మూకుమ్మడి రాజీనామాలు

### - సుమన్ వ్యవహారశైలిపై యువత గుర్రు



మందమర్రి, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): ఎమ్మెల్యే బాల్క సుమన్ తీరును నిరసిస్తూ బిఆర్ఎస్ యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు ఆదివారం మూకుమ్మడిగా ఆ పార్టీకి రాజీనామా చేశారు. స్థానిక శ్రీ కృష్ణ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో సాలు సారూ.. మీ పాలన.. అంటూ చేతులెత్తి దండం పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ముజాహిద్, రామకృష్ణాపూర్ కి చెందిన యూత్ అధ్యక్షుడు బింగి శివకిరణ్, మందమర్రి పట్టణ 17వ వార్డు అధ్యక్షుడు పోలూ నరేష్, ఆర్కేపి సోషల్ మీడియా ఇంచార్జ్ ఇందాస్ లతో పాటు సుమారు 200 మంది యువ కార్యకర్తలు పార్టీకి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముజాహిద్ మాట్లాడుతూ విప్ బాల్క సుమన్ తన ఐదు సంవత్సరాల పాలనలో యువతకు ఒరగబెట్టింది ఏమీ లేదని తన పబ్బం కోసం యువతను వాడుకున్నాడని మండిపడ్డారు. ముఖ్యంగా యువతను తన గుప్పెట్లో బంధించి సోషల్ మీడియా కార్యక్రమాల పేరిట రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్నారి ఆరోపించారు. ఏ ఒక్క యువ కార్యకర్తను అక్కున చేర్చుకొని ఉపాధి అవకాశాలు కల్పించిన సందర్భాలు లేవన్నారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పిస్తానని మాయమాటలు చెప్పిన కేసీఆర్ మాటలకు మోసపోయామని ఎన్నికలకు ముందు నియోజకవర్గానికి అందుబాటులో ఉంటాను అన్న సుమన్ ప్రజల సమస్యలు గాలికి వదిలేసి పిఎలతోనే అంతా కొనసాగిస్తున్నారని విమర్శించారు. స్థానికంగా ఉంటానని నమ్మ పలికి కోట్ల రూపాయలు వెచ్చించి క్యాంప్ కార్యాలయాలు నిర్మిస్తే అందులో ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడం బాధాకరమని తెలిపారు. 'మేము మోసపోయాం మీరు మోసపోకండి' అనే నినాదంతో తాము ముందుకు వెళ్తామని, రాబోయే రోజులలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో చెన్నూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. బాల్క సుమన్ అరాచకాలను ఎండగడదామని స్థానికేతరుడైన సుమన్ ను నియోజకవర్గం నుండి తరిమేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎలిగేటి రమేష్, భుక్య తిరుపతి, వడల ప్రణీత్, సాయి, రమేష్, జాఫర్, జుబేర్ తదితర యువ నాయకులు పాల్గొన్నారు.



## సైనికునికి ఘన స్వాగతం పలికిన బాల్య మిత్రులు

కరీంనగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): సైన్యంలో ముప్పై ఏళ్ల పాటు సేవలందించి జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్‌గా పదవీ విరమణ పొంది స్వగ్రామానికి వస్తోన్న సైనికునికి బాల్య మిత్రులు ఆదివారం ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికారు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన అడ్లూరి శ్రీనివాసరాజు సైన్యంలో ముప్పై ఏళ్లుగా సేవలందించి, ఉద్యోగ విరమణ చేసి మొదటి సారిగా స్వస్థలానికి వచ్చారు. ఈ సందర్భంగా నగరంలోని గంజ్ హై స్కూల్ 1989-90 బ్యాచ్‌కు చెందిన అతని చిన్ననాటి మిత్రులు ఘనంగా స్వాగతించారు. మొదట అలుగునూర్ చౌరస్తాలో డప్పు వాయిద్యాలు, పూలమాలలతో శ్రీనివాసరాజుకు ఘనంగా స్వాగతం పలికి, అనంతరం నగరంలోని కమాన్ చౌరస్తాలో పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రాజు కుటుంబ సభ్యులతో పాటు అతని చిన్ననాటి మిత్రులు కటుకం గోపి, బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్, మనోహర్, మోహన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## దళిత యువకులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

### అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కొమురయ్య



చిగురుమామిడి, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): దొంగతనం చేశారనే నెపంతో మందమర్రి పట్టణానికి చెందిన దళిత యువకులను చిత్రవధలు చేసి, తీవ్రంగా కొట్టిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు సాంబారి కొమురయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తేజ, కిరణ్ అనే దళిత యువకులను కాళ్లు చేతులు కట్టి తలకిందులుగా వేలాడదీసిన రాములు, అతని భార్య, కుమారున్ని తక్షణమే అదుపులోకి తీసుకోవాలన్నారు. అవమానాన్ని భరించలేక కనిపించకుండా పోయిన కిరణ్‌కు ఏం అపా యం జరిగినా రాములు కుటుంబమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం



మంచిర్యాల, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల హైటెక్ సిటీ ఆధ్వర్యంలో స్థానిక గోదావరి రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కే.సుగుణాకర్ రెడ్డి, డాక్టర్ కృష్ణ లు 300 మంది విద్యార్థిని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# శబరిమల సమాచార కేంద్ర ఏర్పాటుకు కృషి

## ఎబిఎపి రాష్ట్ర అధ్యక్షులు తిరుమల్ రావు

మంచిర్యాల, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): మంచిర్యాల జిల్లా కేంద్రంలో శబరిమల సమాచార కేంద్ర ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర అధ్యక్షులు బేతి తిరుమల్ రావు పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ లో మంచిర్యాల జిల్లా ఏబీఏపీ అధ్యక్షులు కొండు నర్సింహారావు అధ్యక్షతన జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో ప్రధాన కార్యదర్శి పుల్లం రాజుతో కలిసి పాల్గొన్నారు. ముందుగా ఇటీవల మృతి చెందిన ఏబీఏపీ సభ్యులు భక్తులు భీమయ్య, సందీప్‌ల మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం మా ట్లాడుతూ జిల్లా కేంద్రంలో డిసెంబర్‌లో 5వేల మంది అయ్యప్ప స్వాములతో మహా సంగమం పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 108 హోమ కుండములచే సామూహికంగా అయ్యప్ప స్వాముల మహా సంగమ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వివిద ఏరియాల్లో నిర్వహించే సామూహిక పడిపూజా క్యాక్రమాలు ఇక నుంచి ఏబీఏపీ ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 12 బ్రాంచిలున్నాయని, 18 మండలాల్లో అయ్యప్ప ధర్మప్రచార సభను విస్తరించ డానికి 3 అయ్యప్ప భక్తులు కృషి చేయాలని కోరారు. నవంబర్లో విశాఖప ట్నంలో ఏబీఏపీ నిర్వహించే అయ్యప్ప స్వాముల మహా సంఘమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలతో అయ్యప్ప ధర్మాన్ని, తత్వాన్ని భక్తులకు వివరించి ప్రజలను భక్తి మార్గంలో నడిపించాలని, అన్నదానాలు, సేవా కార్యక్రమాలు చేపట్టాలని, అయ్యప్ప స్వాములు అందుబాటులో ఉన్న గోశాలలకు ఆహార ధాన్యాలు అందించాలని, గోశాలలతో గోమాత సంపదను పెంపొందించాలని కోరారు.




అనంతరం బ్రాంచి కమిటీలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందించారు. ఈ సమావేశంలో ఏబీఏపీ జాతీయ కార్యవర్గ సభ్యులు కొండ శ్రీనివాస్, జాతీయ కోర్ కమిటి సభ్యుడు భాస్కర్ల రాజేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టపల్లి సంపత్రావు, జిల్లా సంయుక్త కార్యదర్శి క్రిష్ణ, నస్పూర్ బ్రాంచి అధ్యక్షుడు గోళి వజ్రవేలు, కార్యదర్శి అమిరిశెట్టి కుమరస్వామి, శ్రీరాంపూర్ బ్రాంచి అధ్యక్షుడు బొడ్డు లక్ష్మన్, మంచిర్యాల కాలేజి రోడ్ బ్రాంచి అధ్యక్షుడు నగునూరి శ్రీనివాస్, సభ్యులు రఘుపతిరావు, రవిక్రిష్ణా, వడ్డె శ్రీనివాస్, సంపత్కుమార్, టీ శ్రీనివాస్, కాపు శ్రీనివాస్, రాజేందర్, మర్రి మొగిళి, రాములు, నరేశ్, కార్తీక్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి సేవిస్తున్న వ్యక్తి అరెస్ట్

### 120 గ్రాముల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం: సిఐ ఉపేందర్

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): అక్రమంగా గంజాయి సేవిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, 120 గ్రాముల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు సిరిసిల్ల పట్టణ సీఐ ఉపేందర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెడ్డి మల్ల నవీన్ శ్రీనివాస్ అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా గంజాయి తాగడానికి అలవాటు పడి గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర గంజాయి కొనుగోలు చేసి తాగుతూ, తానే వారికి అమ్ముతుండగా శనివారం రాత్రి పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్‌లోఅదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 120 గ్రాముల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# మంత్రి గంగులకు గ్రానైట్ లారీ అసోసియేషన్ మద్దతు



కరీంనగర్, ఆగస్టు 3 (మనం న్యూస్): రాష్ట్ర పౌరసరఫరాలు, బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు గ్రానైట్ లారీ అసోసియేషన్ సభ్యులు మద్దతు ప్రకటించారు. ఆదివారం మంత్రి మీ సేవా కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసిన వారు వెండి లారీ ప్రతిమను బహుకరించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్ని కల్లో మరోసారి ఘన విజ యం సాధిం చేలా వెన్నంటి ఉంటామని హామీని చ్చారు. నాలుగవ సారి భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రానైట్ లారీ అసోసియేషన్ నాయకులు తిరుపతి, శివ, ముత్తు, రాంగోపాల్, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత యువకులపై దాడి చేసిన వారిని

# కఠినంగా శిక్షించాలి

### సీనియర్ కాంగ్రెస్ నాయకులు పసుల వెంకటి



ఇల్లంతకుంట, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): మంచిర్యాల జిల్లా మంద మర్రి పట్టణంలో దళిత యువకులను దొంగతనం చేశారనే నెపంతో చిత్రవధలు చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమో దు చేసి కఠినంగా శిక్షించాలని సీని యర్ కాంగ్రెస్ నాయకులు పసుల వెంకటి డిమాండ్ చేశారు. ఆదివా రం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ తేజ, కిరణ్‌లను కాళ్లు చేతులు కట్టేసి,తలకిందులుగా వేలాడదీసి మంట పెట్టి చిత్రవధ చేసిన రాములు, అతని భార్య, కుమారున్ని వెంటనే అదుపులోకి తీసుకోవా లన్నారు. అవమానాన్ని భరించలేక అదృశ్యమైన కిరణ్ కు అపాయం జరి గిన పక్షంలో చాకలి రాములు కుటుంబమే బాధ్యత వహించాలన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

## సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి

కరీంనగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా కాలయాపన చేస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి వ్యాఖ్యా నించారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో నిర్వహిం చిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల ఒకటి నుండి ఏడు వరకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు అఖిలభారత కమిటీ పిలుపుమేరకు జిల్లాలో 4,5 తేదీల్లో తహసిల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు, ఏడవ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువకులు ఆశగా ఎదురుచూస్తున్నారని, ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు కుదించడంతో కూలీల బతుకులు ఆగమవుతున్నాయన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఒకవైపు పేదలపై భారాలు వేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తుందని విమర్శించారు. దేశంలో 65 శాతమున్న యువతకు ఉపాధి, ఉద్యోగం కరువై నిరుద్యోగులుగా తిరుగుతున్నారని, ఉన్నత చదువులు చదివిన వారు సైతం కూలి పనులకు వెళ్తున్నారని ఆవేదన



వ్యక్తం చేశారు. 2014 ఎన్నికల సందర్భంగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని దేశ ప్రధాని హామీ ఇచ్చారని ఆచరణలో ఉన్న ఉద్యోగాలు ఊడిపోతున్నాయని, ఈ కాలంలో దాదాపు ఒక కోటి 50 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలే లక్షలాదిగా ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిందని, 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం 11.5 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు ఇస్తామని, కేవలం నాలుగు లక్షల ఎకరాలకు మాత్రమే ఇచ్చారని వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. దళితులు, గిరిజనులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని, కార్మికులకు కనీస వేతనాలు సవరించలేదన్నారు. సమ్మెల పట్ల ప్రభుత్వం అసహనాన్ని ప్రదర్శిస్తుండడం దురదృష్టకరమని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని పక్కనపెట్టి కొత్తగా గృహలక్ష్మి పథకం తెచ్చారని అది కూడా అర్హులైన పేదలందరికీ అందే అవకాశం లేదన్నారు. రాష్ట్రంలో 16 లక్షల మంది కౌలు రైతులకు 2011 చట్టం ప్రకారం రుణ అర్హత కార్డులు ఇచ్చి రుణమాఫీ తో పాటు వడ్డీ కూడా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలన్నారు. నిత్యవసర సరుకుల ధరలను తక్షణమే తగ్గించాలని, మార్కెటింగ్ వ్యవస్థను పటిష్టపరిచి బ్లాక్ మార్కెట్ను అరికట్టాలని డిమాండ్ చేశారు. పేదలపై వేసిన పన్నుల భారాన్ని తగ్గించి కార్పొరేట్ సంస్థలపై ఆదాయ పన్నులు 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు.

ఉపాధి హామీ పనులకు కేటాయింపు లను మూడు రెట్లు పెంచాలని, విద్యా, వైద్య సౌకర్యాలు ఉచితంగా కల్పించాలని, పేదలందరికీ ఆవాసాలు కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. డిమాండ్ల సాధన కొరకు జిల్లా వ్యాప్తంగా జరిగే నిరసన ఉద్యమాల్లో జిల్లా ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వాసుదేవ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకర సంపత్, ఎడ్ల రమేష్, జిల్లా నాయకులు గజ్జల శ్రీకాంత్ అరవింద్ పాల్గొన్నారు.

## ఎస్సైగా ఎంపికైన లక్ష్మణ్‌కు సన్మానం



హుజురాబాద్ రూరల్, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో ఎస్సైగా ఎంపికైన రాంపూర్‌కు చెందిన వేముల లక్ష్మణ్‌ను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంపూర్ లాంటి గ్రామీణ ప్రాంతానికి చెందిన లక్ష్మణ్, హుజురాబాద్ గ్రౌండ్‌లో ఫిజికల్ డైరెక్టర్ రాజిరెడ్డి సూచనలతో శిక్షణ పొంది ఉద్యోగం సంపాదించడం సంతోషదాయకమన్నారు. లక్ష్మణ్‌ను చూసి మిగతా యువకులు స్ఫూర్తి పొంది ఉద్యోగాలు పొందడానికి సమాయత్తం కావాలన్నారు. అనంతరం పిడి రాజిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాల పరీక్ష సమయంలో హుజురాబాద్ గ్రౌండ్‌లో ఎంతోమంది యువతీ యువకులకు తాను ఉచితంగా కోచింగ్ ఇచ్చినట్లు, ఇక్కడ శిక్షణ తీసుకున్న 25 మంది వరకు ఎస్సైలు, కానిస్టేబుళ్లు, ఇతర ఉద్యోగాలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేముల గోవర్ధన్, మాజీ అధ్యక్షులు రమేష్, రిటైర్డ్ టీచర్ వేల్పుల రత్నం, లారీ అసోసియేషన్ అధ్యక్షులు సలీం, రామ్ కుమార్, పెండోట ప్రకాష్, మునీరోద్దిన్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

## లాలపల్లి గ్రామంలో శ్రావణ సండే సందడి



ఎలిగేడు,సెప్టెంబర్ 03 మనం న్యూస్ : పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామంలో ఆదివారం శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆవరణలో అల్లంకి భూమయ్య సుశీల జ్ఞాపకార్థం వారి యొక్క కుమారులు అల్లంకి ఆనందం,సత్యనారాయణ కుటుంబ సభ్యులతో మల్లికార్జున దేవస్థాన ఆవరణలో శ్రావణ సండే సందడిగా మారింది. గత సంవత్సరం అల్లంకి భూమయ్య సుశీల జ్ఞాపకార్థం వారి యొక్క కుమారులు దేవస్థానం ఆవరణలో ఫంక్షన్‌లో నిర్వహించారు. ఇదే ఫంక్షన్ హాల్‌లో వారు శ్రావణ సండే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ సింగిరెడ్డి,ఎల్లవ్వ,రాజేశ్వర్‌రెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు సామ రాజేశ్వర్‌రెడ్డి,పెద్ది రాజేశం,ఎలేటి మల్లారెడ్డి,గడ్డం శ్రీనివాస్,కోమటిరెడ్డి కిషన్‌రెడ్డి,బద్దం మల్లారెడ్డి,గుర్రం మల్లారెడ్డి,గ్రామప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎల్ఓసి అనుమతి పత్రం పంపించిన జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ ఇజ్జగిరి రాజు



రామగిరి,సెప్టెంబర్ 03 మనం న్యూస్ : సోషల్ మీడియా ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ గురించి, ఎల్ఓసి గురించి జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ ఇజ్జగిరి రాజు పంపిణీ చేసినవి చూసి మంచిర్యాల జిల్లాకి చెందిన తెలిసిన వారు నిరుపేదస్తులు రమేష్ వాళ్ళ అబ్బాయి కిడ్నీ వాధి ట్రీట్మెంట్ గురించి రాజుని సంప్రదించగా వారికి మంచిర్యాల శాసన సభ్యులు దివాకర్ రావు ద్వారా లెటర్ పెట్టించి మంత్రి కేటి ఆర్ కార్యాలయం ద్వారా ఒక్కరోజులోనే 2,50,000 రూపాయలు ఎల్ఓసి లెటర్ రమేష్ తీసుకోవడం జరిగింది. దీనికి సహకారం అందించిన మంచిర్యాల శాసన సభ్యులు దివాకర్‌రావుకి ,మంత్రి కేటీఆర్‌కి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కి రమేష్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

# మహాధర్నాను జయప్రదం చేయాలి

### టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం



కరీంనగర్, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా ఈ నెల 4న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మహాధర్నాను జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతులు, నిరుద్యోగులు, మహిళలు, మైనార్టీలు, బిసిలు, గిరిజనులు, దళితులకిచ్చిన హామీలను అమలుపరచడం లో పూర్తిగా విఫలమైందన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ లను కట్టించడంలో విఫలం చెందిన కేసీఆర్, గృహలక్ష్మి పేరుతో మూడు లక్షలు ఇస్తామంటు మరో మోసానికి తెరలేపారన్నారు. గృహలక్ష్మి ధరఖాస్తులకు మూడు రోజుల గడువు ఇచ్చిన ప్రభుత్వం వైన్ షాపులకు మాత్రం 15 రోజుల గడువు ఇచ్చారన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామంటూ గత ఐదు సంవత్సరాలుగా ఆశ చూపిస్తూ ఓట్లు వేయించుకుంటున్నారన్నారు. ఐదేళ్లుగా రుణమాఫీ చేయకపోవడం వల్ల వడ్డీ రెండింతలు అప్పు రైతుల మెడకు చుట్టుకుందన్నారు.ఇప్పటికే 20 లక్షల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ధోరణిలో లోపాల వల్ల నాలుగు లక్షల మంది రైతులు భూహక్కుల పై ధరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. భూమిలేని దళితులు, గిరిజనులకు మూడెకరాల భూమి హామీ ఇచ్చిన కెసిఆర్ గత ప్రభుత్వాలు ఇచ్చిన భూములను లాకుంటున్నారని ధ్వజమెత్తారు. 2018 నుంచి మహిళా సంఘాలకు ఇస్తానన్న పావలా వడ్డీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారిందని విమర్శించారు. మహిళలకు తీసుకున్న అప్పుకు ఇప్పటికే నాలుగు వేల కోట్ల రూపాయల వడ్డీలు చెల్లించారని గుర్తు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇటీవల దళిత బంధు, బిసి బంధు, మైనార్టీ బంధు అంటూ గ్రామానికి ఒకరికి చెక్కు ఇచ్చి ప్రజలందరి ఓట్లను కొల్లగొట్టే మోసానికి తెగబడ్డారని సత్యం ఆరోపించారు. ఎన్నికలు వస్తే తప్ప సంక్షేమ పథకాలు కేసీఆర్ కు గుర్తు రావడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను గుర్తు చేస్తూ ప్రజలను చైతన్యవంతం చేయడానికి నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## 60 సంవత్సరాల పాటు నిరుపేదలను పట్టించుకోని కాంగ్రెస్ పార్టీ కావాలా



**9 సంవత్సరాల పాటు నియోజకవర్గంలో ఫ్యాక్షన్ హత్యా రాజకీయాలు చేసిన బిఆర్ఎస్ నాయకులు కావాలా**

**ప్రజాసేవకై లక్షల రూపాయల జీతాన్ని వదులుకొని 10 సంవత్సరాలుగా ప్రజాక్షేత్రంలో ఉన్న సునీల్‌రెడ్డి కావాలా**

**ఈ సారి జరిగే ఎన్నికల్లో ప్రజలు నిర్ణయించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న మంథని నియోజకవర్గ అభివృద్ధి బిజేపి పార్టీతోనే సాధ్యం**

రామగిరి,సెప్టెంబర్ 03 మనం న్యూస్ : పెద్దపల్లి జిల్లా రామగిరి మండల స్థాయి కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం 50 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు యువకులు బిజెపి పార్టీలో చేరగా వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సునీల్‌రెడ్డి మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో అవినీతి అరాచకాలకు దూరంగా ఉండి గత పదిసంవత్సరాల పాటుగా లక్షల రూపాయల జీతాన్ని వదులుకొని నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండి నియోజకవర్గంలో నిరుపేదల బ్రతుకులలో వెలుగులు నింపడానికి అనుక్షణం పోరాడుతున్న నన్ను రానున్న ఎన్నికల్లో ఈ సారి ఆదరించి ఆశీర్వదించాలని నియోజకవర్గ ప్రజలను సునీల్‌రెడ్డి కోరారు. మంథని ప్రాంతంలో అవినీతి అక్రమాలు పెరిగిపోయాయని,మంథని ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. మన గెలుపు ఒక చరిత్ర సృష్టించబోతోందని,యువత రాజకీయాలోకి రావాలని,మీతోనే మార్పు సాధ్యం అని,కేంద్ర పథకలు ప్రజలకు వివరించారు.

కుటుంబ అవినీతి పాలన అంతం బిజెపి పార్టీతోనే అని,40 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ అభివృద్ధి శూన్యం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మళ్ళీ మాయ మాటలతో వస్తుందని తిప్పి కొట్టాలి అన్నారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల ఇంచార్జ్ మోలుమూరి శ్రీనివాస్,ఎడ్ల సదాశివ,జిల్లా అధికార ప్రతినిధి పోతారవేని క్రాంతికుమార్,మంథని టౌన్ అధ్యక్షులు బూడిద తిరుపతి,బిజెపి ఐటి సెల్ కన్వీనర్ తోట్ల రాజు,రామగిరి మండలం సోషల్ మీడియా ఇన్చార్జ్ రేణిగుంట్ల విజయ్,సీనియర్ నాయకులు కోరబోయిన మల్లిక్,యాట భూమేష్,బత్తిని నరసయ్య,తదితరలు పాల్గొన్నారు.

## టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకుంట

# విజయరమణారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

కాల్వశ్రీరాంపూర్,సెప్టెంబర్ 03 మనం న్యూస్ : కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో గంగారం గ్రామపంచాయతీ పరిధిలో ఉషన్నపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్,బిజెపి నాయకులు చీర అజయ్,ఉమ్మల రాకేష్,జునుమాల విజయ్,మేడి రాజ్‌కుమార్,నోముల శ్రీకాంత్, అనవేన శ్రీనివాస్,అనవేన సతీష్, జునువాల అశోక్,ముష్కే సతీష్,ముస్కు వంశీ ,కొమ్ము పవన్,నూనె సందీప్,పెంట శివకుమార్, గొడుగు రాజు,జునుమాల అఖిల్,ముస్కు రంజిత్,పైడిపల్లి సతీష్,మామిడి కార్తిక్,బండారి సంపత్,ముస్కె రవి,చీర మల్లయ్య,చిర సదయ్య, ఉమ్మల్ల లింగయ్య, రానవేన వెంకట్రాజం, వంగ మహేష్,ముస్కే అజయ్ ల పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే,టిపిసిసి ఉపాధ్యక్షులు శ్రీ చింతకుంట విజయరమణరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో తీర్థం పుచ్చుకున్నారు. వారందరికి కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించి,పెద్దపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని విజయరమణరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపిపి గోపగాని సారయ్యగౌడ్,మాజీ జెడ్పిటిసి లంక సదయ్యలు,కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# యోగాతోనే ఆరోగ్యం

## యోగా,ధ్యానంతో ఒత్తిడి దూరం

### పెద్దపల్లి ఏసిపి ఎడ్ల మహేష్



సుల్తానాబాద్,సెప్టెంబర్ 03 మనం న్యూస్ ః యోగాతో మానవాళి సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పెద్దపల్లి ఏసిపి ఎడ్ల మహేష్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ సుల్తానాబాద్ సర్కిల్ పోలీస్ ఆధ్వర్యంలో మహిళలు, యువత, వృద్ధులు, విద్యార్థిని విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యం, శ్రేయస్సును ఆకాంక్షిస్తూ యోగ ఆసనాలు, ప్రాణాయామాలు, ముద్రలు, ఆయుర్వేదం, ధాన్యంపై అవగాహన,ఉచిత శిక్షణ కోసం ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిసి మాట్లాడుతూ యాంత్రిక జీనవంలో మనం అనేక రకాల ఒత్తిళ్లకు,అనారోగ్యాలకు గురవుతున్నామని,యోగా,ధ్యానంతో వీటిన్నింటి నుంచి దూరమై ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని ఏసిపి ఎడ్ల మహేష్ అన్నారు. దీంతో అనేక రోగాలను తగ్గించుకోవడంతో పాటు నియంత్రించుకోవచ్చన్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు అనేక దేశాలు, ప్రభుత్వాలు యోగాకు ప్రాధాన్యం ఇస్తున్నాయని తెలిపారు. యోగ,ధ్యానాన్ని రోజువారీ కార్యక్రమాల్లో భాగం చేసుకోవాలి అని తెలిపారు. ఒత్తిడి సమయంలో యోగ ప్రక్రియ మానసిక ప్రశాంతత కోసం చాలా ఉపయోగపడుతుందని, నిత్య జీవితంలో యోగ,ధ్యానం అలవాటు చేసుకుంటే మన ఆరోగ్యం మన చేతుల్లో ఉంటుందని,మానవ సంబంధాల్లో వస్తున్న మార్పులు, ప్రభావాలను యోగతో అరికట్టవచ్చన్నారు. యోగ శిక్షణ శిబిరంలో సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జగదీష్,పెద్దపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ,సుల్తానాబాద్ ఎస్సై విజేందర్, కాల్వశ్రీరాంపూర్ ఎస్సై శ్రీనివాస్,పోత్కపల్లి ఎస్ఐ శ్రీధర్,జూలపల్లి ఎస్ఐ వెంకటకృష్ణ, ధర్మారం ఎస్సై సత్యనారాయణ,యోగ గురువులు సంపత్, ప్రభాకర్ శర్మ,యోగా శిక్షకురాలు ఆమని,పెద్దపల్లి డివిజన్ పోలీస్ సిబ్బంది, సుల్తానాబాద్ వాకర్స్ అసోషియేషన్ ప్రెసిడెంట్ బైరగోని రవి,మెంబర్స్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు రవి,అలాగే 2500 మంది విద్యార్థులు, యువత, మహిళలు ,వృద్ధులు పాల్గొన్నారు.





## ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### అదనపు కలెక్టర్ దీపక్ తివారి



కొమురంభీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 3 (మనం న్యూస్)ః భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఆర్డి ఓ రాజేశ్వర్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వయసు అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటు నమోదు చేసుకోవాలని, నూతన ఓటరు నమోదుతో పాటు ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపులకు ప్రభుత్వం అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలలో నూతన ఓటరు నమోదు, సవరణలు, మార్పులు, తొలగింపుల కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, వయసు అర్హత గల ట్రాన్స్ జెండర్లు, దివ్యాంగులు, ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక శిబిరాల ద్వారా పూర్తిస్థాయిలో ఓటరు నమోదుకు కృషి

### కలెక్టర్ హేమంత్ సహదేవరావు

కొమురంభీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 3 (మనం న్యూస్)ః ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల ద్వారా జిల్లాలో పూర్తిస్థాయిలో ఓటరు నమోదుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. ఆదివారం జిల్లాలోని ఆసిఫాబాద్, చింతల మానేపల్లి, కౌటాల, సిర్పూర్ టి మండలాలలోని పోలింగ్ కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఆర్. డి. ఓ. రాజేశ్వర్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను 18 సం॥లు నిండిన వయస్సు అర్హత గల వారు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వయసు అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటు నమోదు చేసుకోవాలని, నూతన ఓటరు నమోదుతో పాటు ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపులకు ప్రభుత్వం అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలలో నూతన ఓటరు నమోదు, సవరణలు, మార్పులు, తొలగింపుల కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, వయసు అర్హత గల ట్రాన్స్ జెండర్లు, దివ్యాంగులు, ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు ఆన్లైన్లో, ఓటర్ హెల్ప్లైన్, మొబైల్ యాప్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## మూడు ఎమ్మెల్యే స్థానాలివ్వకుంటే..

# కెటిఆర్‌ను ఓడిస్తాం

### ముదిరాజ్‌ల హెచ్చరిక

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): బిఆర్ఎస్ అధిష్టానం రాష్ట్ర వ్యాప్తంగా మూడు చోట్ల శాసనసభ టికెట్లు ముదిరాజ్‌లకు కేటాయించాలని, లేని పక్షంలో సిరిసిల్లలో కేటీఆర్ ను ఓడిస్తామని ముదిరాజులు హెచ్చరించారు. సిరిసిల్లలోని సుమారు ఐదు వేల మంది ముదిరాజులు భారీ వర్షాన్ని లెక్కచేయకుండా సిరిసిల్ల కళాశాల మైదానంలో ముదిరాజుల సంఘం జిల్లా అధ్యక్షులు రానవేని లక్ష్మణ్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. కళాశాల మైదానం నుంచి నేతన్న చౌక్, అంబేద్కర్ చౌక్,గాంధీ చౌక్ మీదుగా నిరసన ర్యాలీ చేపట్టి, అంబేద్కర్ విగ్రహం వద్ద రెండు గంటల పాటు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ న్యాయవాది, కోర్ కమిటీ సభ్యులు పిట్టల భూమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 60 లక్షల మంది ముదిరాజు జనాభా ఉందని సుమారు 30 శాసనసభ సీట్ల వరకు ముదిరాజులు అర్హులని పేర్కొన్నారు. ప్రధానంగా తెలంగాణలోని అత్యధిక ముదిరాజ్ జనాభా ఉన్న మునుగోడు, పఠాన్ చెరువు, సంగారెడ్డి అసెంబ్లీ స్థానాలకు శాసనసభ టికెట్లను ముదిరాజులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ముదిరాజులు అనేక ఉద్యమాలు చేశారని, రాష్ట్రంలో ముదిరాజులకు ప్రత్యేక స్థానం కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. బిజెపి, కాంగ్రెస్ తో పాటు ఇతర పార్టీలు ముదిరాజుల



జనాభా దామాషా ప్రకారం శాసనసభ టికెట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన ముదిరాజ్ నేతలు రెడ్డవేని గోపి, రేగుల మల్లికార్జున్, చొక్కాల రాము, గొడుగు నరసయ్య, ఉత్తమ్ అంజయ్య, పిట్ల రామ్ గోపాల్, కీసరి నాగరాజు, తుపాకుల రవి, బోయిని చంద్రయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రశాంత్‌రెడ్డికి మద్ధతుగా మున్నూరుకాపు సంఘం తీర్మాణం



భీంగల్, సెప్టెంబర్ 3 (మనం న్యూస్)ః రాబోయే ఎన్నికల్లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికే తమ పూర్తి మద్ధతు ప్రకటిస్తున్నట్లు భీంగల్ మండలం బడా భీంగల్ గ్రామ మున్నూరుకాపు సంఘ సభ్యులు ఏకగ్రీవ తీర్మాణం చేశారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు సభ్యులు ఏకగ్రీవ తీర్మానం కాపీని గ్రామ శాఖ అధ్యక్షులు రాగుల మోహన్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చింతకింది బావాయి భూమేష్, గ్రామ సర్పంచ్ ఎర్రోళ్ల సంజీవ్,ఉప సర్పంచ్ బాల్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు రావుల లింబాద్రి, మాజీ వీడీసీ అధ్యక్షుడు కిషన్, వార్డ్ సభ్యులు, మద్దతు తెలిపిన మున్నూరు కాపు సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పురస్తు నరేష్‌కు సన్మానం



భీంగల్, సెప్టెంబర్ 3 (మనం న్యూస్) : జిల్లా అవార్డు పొందిన పురస్తు నరేష్ కు ఐకెపి సికింద్రాపూర్ మహిళ గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వివో ఏ రత్నాకర్ గౌడ్, బ్యాంక్ మేనేజర్ నరేష్, ఎంపిటిసి సభ్యులు గజెందర్, లక్ష్మి, గ్రామ సంఘం ప్రెసిడెంట్ జిన్న దరణిజ, 50 సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

## బాధితుడికి ఫోన్ అప్పగించిన ఎస్సై హరిబాబు



భీంగల్, సెప్టెంబర్ 3 (మనం న్యూస్)ః పట్టణానికి చెందిన అజ్జని లింబాద్రి రెండు నెలల క్రితం సెల్ ఫోన్ పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఈఐఆర్ పోర్టల్ ఆధారంగా ఫోన్ ను ట్రాప్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఎస్సై హరిబాబు బాధితునికి ఫోను తిరిగి అప్పగించారు. ఫోన్‌ను గుర్తించి తిరిగి తనకు అప్పగించినందుకు ఎస్సై హరిబాబు, సిబ్బంది సుధీర్, రాజు, రాజేందర్ కు ధన్యవాదాలు తెలిపారు.

### లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### ఎస్సై సామల రాజేష్



చిగురుమామిడి, సెప్టెంబర్ 3 (మనం న్యూస్)ః కేసుల సత్వర పరిష్కారానికి నిర్ధేశించిన లోక్ అదాలత్‌ను మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై సామల రాజేశ్ ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 1నుండి 9వ తేదీ వరకు హుజురాబాద్ 3ఎం ఎం కోర్టులో నిర్వహిస్తోన్న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోన్నట్లు తెలిపారు. యాక్సిడెంట్, చీటింగ్ కేసులు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చిన్నచిన్న దొంగతనాల కేసులు, ఇతర రాజీ పడదగ్గ కేసులు, పెట్టి కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను ఈ నేషనల్ లోక్ అదాలత్ లో రాజీ చేసుకుని, కేసులను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ప్రతీకారాలకు పోకుండా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని కేసులను పూర్తిగా క్లోజ్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.



## విద్యార్థులకు ఉపకారవేతనాలందించిన కరీంనగర్ డెయిరీ

చిగురుమామిడి, సెప్టెంబర్ 3 (మనం న్యూస్): మండలంలోని కరీంనగర్ డెయిరీ పాల ఉత్పత్తిదారుల కుటుంబాలకు చెందిన 40మంది విద్యార్థులకు ఆదివారం ఉపకార వేతనాలను పంపిణీ చేసినట్లు హుస్నాబాద్ మిల్క్ చిల్లింగ్ సెంటర్ మేనేజర్ చింతపూల నాగయ్య తెలిపారు. ఒక్కో విద్యార్థికి ఎనిమిది వందల రూపాయల చొప్పున 40మందికి 32వేల రూపాయల నగదును అందజేసినట్లు చెప్పారు. అదే విధంగా బహు వార్షిక పథకం కింద పశుగ్రాసం పెంచుకున్న 12మంది రైతులకు 20వేల రూపాయలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ తిరుపతిరెడ్డి, చిగురుమామిడి పాలకేంద్రం అధ్యక్షుడు పన్యాల శ్రీధర్ రెడ్డి, లంబాడిపల్లి అధ్యక్షుడు కర్ర అశోక్ రెడ్డి, సూపర్వైజర్ అప్పల మల్లయ్య, డైరెక్టర్లు పరుశురాములు, కయ్యం మహేందర్,పాలకేంద్రం కార్యదర్శిలు చకిలం శ్రీనివాస్,ఆది శ్రీకాంత్, టెస్టర్ మల్లం శ్రీనివాస్, పాల ఉత్పత్తిదారులు జెట్టి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన రసమయి

మానకొండూరు, సెప్టెంబర్ 3 (మనం న్యూస్)ః మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పర్యటించిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మానకొండూర్ మండలం లింగాపుర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రజక, యాదవ, ఎస్సీ కమ్యూనిటీ భవనాలతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు తాల్లపల్లి శేఖర్ గౌడ్, సర్పంచ్ పొల్సాని మురళీధర్ రావు తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

